క్లుప్తంగా

వివేకానందను యువత ఆదర్శంగా తీసుకోవాలి

సత్తెనపల్లి: యువతలో ఉత్తేజాన్ని.. స్ఫూర్తిని నింపిన మహనీయుడు స్వామి వివేకానంద అని, అలాంటి గొప్పవ్యక్తిని యువత ఆదర్శంగా తీసుకోవాలని హైదరాబాద్ సిటీ స్మాల్ కాజెస్ కోర్టు సీనియర్ సూపరింటెంట్ పీవీపీ అంజనీ కుమారి అన్నారు. హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని టీచర్ మస్తాన్ ఐటీఐ కళాశాలలో స్వామి వివేకానంద జయంతి వారోత్సవాల వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కంచర్ల బుల్లిబాబు, టీచర్ మస్తాన్ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ ఎన్.రమేష్, కంప్యూటర్ టీచర్ రిహానా మేరీ నిర్మల, విద్యార్థులు, ఫౌండేషన్ సభ్యులు శ్రీలత, పాల్గొన్నారు.

వడ్డెర ఓబన్న విగ్రహం ధ్వంసం చేసినవారిని శిక్షించాలి

సత్తెనపల్లి: గుంటూరు నగరంలో ఈ నెల 11న ప్రారంభోత్సవానికి సిద్ధం చేసిన వడ్డెర ఓబన్న విగ్రహం ధ్వంసం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని వడ్డెర సంక్షేమ సంఘ పట్టణ అధ్యక్షుడు వేముల వరప్రసాదరావు డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. వరప్రసాదరావు మాట్లాడుతూ వడ్డెర ఓబన్న విగ్రహం ధ్వంసం చేసి వడ్డెర జాతిని అవమానపరిచిన వారిని గుర్తించి తక్షణమే శిక్షించాలని ప్రభుత్వాన్ని కోరారు. మరోసారి ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలన్నారు. ఇలాంటి దుష్ట అరాచక శక్తులను కఠినంగా శిక్షించాలని ఆయన కోరారు.

డీటీకి ఇన్‌చార్జి తహసీల్దార్ బాధ్యతలు

క్రోసూరు: క్రోసూరు రెవెన్యూ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న జింకా శ్రీనివాసరావుకు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఇన్‌చార్జి తహసీల్దార్‌గా (ఎఫ్ఏసీ) బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా జింకా శ్రీనివాసరావు గురువారం విలేకరులతో మాట్లాడుతూ రెవెన్యూ సమస్యలు ఏమైనా ఉంటే తప్పక పరిష్కరిస్తానని, ప్రజలు తనను నేరుగా కలుసుకోవచ్చునని అన్నారు. ఈసందర్భంగా వీఆర్ఓలు, రెవెన్యూ కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలియచేసారు.

పాఠశాల ముందు ముగ్గు కలకలం

నకరికల్లు: మండలంలోని గుండ్లపల్లి గ్రామంలోని ఉన్నతపాఠశాల ఎదుట అగంతకులు వేసిన ముగ్గు కలకలం రేపింది. నిమ్మకాయలు, పసుపు, కుంకుమ వేసి ముగ్గు వేసి ఉండడంతో గురువారం పాఠశాల వచ్చిన విద్యార్థులు చూసి భయభ్రాంతులకు గురయ్యారు. చేతబడి, క్షుద్రపూజలు చేసేందుకు ఇలాంటి ముగ్గు వేసి ఉంటారని కలకలం రేగింది. విద్యార్థులకు ధైర్యం చెప్పిన పాఠశాల సిబ్బంది ముగ్గును కడిగేశారు. కాగా ఎంఈఓ-2 ఎంఎల్ఎం ప్రసాద్ మాట్లాడుతూ ఇది ఆకతాయిలు చేసిన పని అయి ఉంటుందని, ఎలాంటి ఆందోళన పడాల్సిన అవసరం లేదని అన్నారు.

విద్యుత్ చౌర్యం నేరం

రాజుపాలెం: అక్రమంగా విద్యుత్ వినియోగిస్తే అపరాధ రుసుముతో పాటు కేసులు కూడా పెడతామని జిల్లా సూపరింటెండెంట్ ఇంజినీర్ డాక్టర్ ప్రత్తిపాటి విజయ్‌కుమార్ హెచ్చరించారు. మండలంలోని అన్ని గ్రామాలలో విద్యుత్ అధికారులు 30 బృందాలుగా ఏర్పడి గురువారం దాడులు నిర్వహించారు. .రాజుపాలెం, కోటనెమలిపురి, కొత్తూరు, పెదనెమలిపురి, గణపవరం, రెడ్డిగూడెం, దేవరంపాడు, మొక్కపాడు, ఉప్పలపాడు గ్రామాలలో 2499 సర్వీసులను తనిఖీ చేశారు. మీటరు లేకుండా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న 8 మందిపై కేసు బుక్‌చేసి రూ9లక్షల అపరాధ రుసుము, మీటరు ఉండి అక్రమంగా విద్యుత్ వినియోగిస్తున్న 9 మందిపై కేసు బుక్ చేసి రూ1.16లక్షలు, అనుమతి లేని కేటగిరిలో వాడుతున్న ముగ్గురికి రూ9లక్షలు, ఎక్కువ లోడ్ వాడుతున్న 59 మందికి రూ1.61లక్షలు అపరాధ రుసుము విధించినట్లు జిల్లా ఎస్ఈ విజయకుమార్ తెలిపారు. ఈ తనిఖీలలో 39 మంది విద్యుత్ అధికారులు, 117 మంది సిబ్బంది 39 బృందాలుగా ఏర్పడి ఏకకాలంలో సర్వీసులను తనిఖీ చేశారు. అపరాధ రుసుముతో పాటు కేసులు కూడా పెట్టామని తెలిపారు. దాడులలో ఈఈ నూతలపాటి సింగయ్య, జిల్లా డీపీఈఈ చిరుమామిళ్ల వెంకటేశ్వరరావు, డిప్యూటీ డివిజనల్ ఇంజనీర్ సురేష్, ఏఈ కోట పెదమస్తాన్ పాల్గొన్నారు.

కేంద్రమంత్రి పదవికి అమిత్‌షా రాజీనామా చేయాలి

సత్తెనపల్లి: కేంద్ర మంత్రి పదవికి అమిత్ షా వెంటనే రాజీనామా చేయాలని, లేనిపక్షంలో ఆయన్ను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బర్తరఫ్ చేయాలని కాంగ్రెస్ పార్టీ సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త చుక్కా చంద్రపాల్ డిమాండ్ చేశారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్‌పై కేంద్రమంత్రి అమిత్ షా పార్లమెంటులో చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ ఏఐసీసీ, పీసీసీ పిలుపు మేరకు పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద, సత్తెనపల్లి మండలం కంకణాల పల్లి గ్రామంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆయా ప్రాంతాల ప్రజలతో కలిసి డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహం పాదాల దగ్గర వినతి పత్రం సమర్పించారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

పీఠం ముడి వీడింది!

- నత్తెనపల్లి, రాజుపాలెం ఏఎంసీల రిజర్వేషన్ ఖరారు
- సత్తెనపల్లి ఏఎంసీకి శోభారాణి, రాజుపాలెం ఏఎంసీకి పూజల పేర్లు ఖరారు!
- ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి వద్దకు జాబితా
- మరో వారంలోపే అధికారిక ప్రకటన వెలువడే అవకాశం
- మా సంగతేమిటి అంటున్న జనసేన, బీజేపీ నేతలు


సత్తెనపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డు

సత్తెనపల్లి: నియోజకవర్గంలో ఎమ్మెల్యే తర్వాత ప్రొటోకాల్ ఉన్న పోస్టు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌కు అన్ని మండలాల్లో ప్రభుత్వ కార్యక్రమాలు, పార్టీ వ్యవహారాల్లో సముచిత స్థానం ఉంటుంది. దీంతో కూటమి అధికారంలోకి వచ్చాక నియోజకవర్గంలోని పలు మండలాల నాయకుల కన్ను ఏఎంసీ చైర్మన్‌ల పీఠంపై పడింది. తాజాగా జిల్లాలోని 12 వ్యవసాయ మార్కెట్ కమిటీలకు ప్రభుత్వం రిజర్వేషన్లు ఖరారు చేసింది. సత్తెనపల్లి ఏఎంసీ సీటును ఓసీ మహిళకు, రాజుపాలెం ఏఎంసీ సీటును బీసీ జనరల్‌కు కేటాయించారు. సంక్రాంతి లోపు కొత్త చైర్మన్లు కొలువుదీరే అవకాశం ఉంటుందని ప్రస్తుత పరిస్థితులు బట్టి తెలుస్తుంది. ఈ నేపథ్యంలో కూటమిలోని టీడీపీ, జనసేన, బీజేపీకి చెందిన ఆశావాహులు ఓవైపు చైర్మన్ పోస్టు కోసం ప్రయత్నాలు ముమ్మరంగా మొదలు పెట్టారు. మరోవైపు ఎన్నో ఏళ్లుగా టీడీపీని అంటిపెట్టుకొని ఉన్న ఆ పార్టీ సీనియర్ నాయకులు సైతం దీనిపై ఆశలు పెట్టుకున్నారు. వీటికి పోటీ ఎక్కువ కావడంతో స్థానిక ఎమ్మెల్యే ఎవరికి అవకాశం ఇస్తారనే విషయం ఇప్పుడు నియోజకవర్గంలో హాట్‌టాపిక్‌గా మారింది.

భారీగా ఆశావహులు...

కూటమిలోని జనసేన, బీజేపీ మాటేమిటో గానీ ఇక్కడ టీడీపీని అంటిపెట్టుకున్న వారిలో ఓసీలు ఎక్కువగా ఉన్నారు. వీరిలో సత్తెనపల్లి ఏఎంసీ చైర్మన్ ఓసీ మహిళకు రిజర్వేషన్ కావడంతో ఓసీ సామాజిక వర్గానికి చెందిన నలుగురు ఆశించారు. సత్తెనపల్లి మండలం పాకాలపాడు గ్రామానికి చెందిన కొనికినేని సత్యనారాయణ, కంకణాలపల్లికి చెందిన కొబ్బరి సుబ్బారావు, పెదమక్కెన గ్రామానికి చెందిన కోమటినేని శ్రీనివాసరావు, గుడిపూడి గ్రామానికి చెందిన లగడపాటి గజానన పేర్లు తెరపైకి వచ్చాయి. వీరిలో కోమటినేని శ్రీనివాసరావు ఆ పార్టీ మండల అధ్యక్షుడిగా, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శిగా పనిచేశాడు. అంతేకాక 2016 స్థానిక సంస్థల ఎన్నికల్లో కోమటినేని శ్రీనివాసరావు భార్య కోమటినేని శోభారాణి పోటీ చేసి ప్రత్యర్థి వద్దుల భూలక్ష్మీ చేతిలో ఓటమిపాలైంది. దీంతో కోమటినేని శోభారాణి పేరునే ఖరారు చేసి సెక్రటరీయేట్‌కు పంపారు. ఈ క్రమంలో సత్తెనపల్లి మండలం గుడిపూడి గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు లగడపాటి గజానన మండలంలోని 26 గ్రామాల టీడీపీ గ్రామ అధ్యక్షులను తీసుకువచ్చి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీ నారాయణ వద్ద కూర్చోబెట్టినట్లు సమాచారం. వారి అభిప్రాయం మేరకు తనకు అవకాశం కల్పించాలని ఆయన కోరినట్లు ప్రచారం. అయితే అప్పటికే ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ తాను పెదమక్కెన గ్రామానికి చెందిన కోమటినేని శ్రీనివాసరావుకు మాట ఇచ్చానని చెప్పినట్లు విశ్వసనీయ సమాచారం.

■ ఇక రాజుపాలెం ఏఎంసీ చైర్మన్ బీసీ జనరల్‌కు రిజర్వ్ కావడంతో పార్టీకి వీర విధేయుడుగా పని చేస్తున్న పూజల వెంకట కోటయ్య పేరును తెరపైకి తీసుకు వచ్చారు. సత్తెనపల్లి ఏఎంసీ చైర్మన్‌గా కోమటినేని శోభారాణి, రాజుపాలెం ఏఎంసీ చైర్మన్‌గా పూజల వెంకట కోటయ్య పేర్లు ఖరారు చేసి లెటర్ ప్యాడ్‌లపై జిల్లా ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆమోదం కోసం పంపినట్లు తెలుస్తోంది. రెండు ఏఎంసీ చైర్మన్ సీట్లు టీడీపీకే కేటాయించడంతో కూటమిలోని జనసేన, బీజేపీ నాయకులు అగ్గిమీద గుగ్గిలం అవుతున్నారు. ఒక చైర్మన్ సీటు తమకు కేటాయించాలని కోరుతూ చాపకింద నీరులా వారి వారి ప్రయత్నాల్లో నిమగ్నమయ్యారని సమాచారం.

భక్తిశ్రద్ధలతో శ్రీవారికి పూజలు

సత్తెనపల్లి: ధనుర్మాసాన్ని పురస్కరించుకొని పట్టణంలోని శ్రీవారి ఆలయాల్లో భక్తులు భక్తిశ్రద్ధలతో వైభవంగా నిత్య పూజలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా పట్టణంలోని వడ్డవల్లి శ్రీ రామాలయం శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో గురువారం శ్రీవారిని నేత్ర దర్శనం అలంకరణలో అలంకరించి పూజలు నిర్వహించారు. సీతారామచంద్ర, లక్ష్మణ, ఆంజనేయ స్వామివారికి ప్రత్యేక అలంకరణలు చేశారు. అలాగే రైల్వేస్టేషన్‌రోడ్‌లోని శ్రీ అలివేలు మంగ పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి దేవాలయంలో శ్రీవారికి హరి సర్వోత్తమ గోవిందా అలంకరణ చేపట్టి పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై శ్రీవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.


నేత్ర దర్శనం అలంకరణలో శ్రీవారు


హరి సర్వోత్తమ గోవింద అలంకరణలో

గొప్ప సంఘ సంస్కర్త షేక్ ఫాతిమా

సత్తెనపల్లి: విద్యాజ్ఞానజ్యోతి, సంఘసంస్కర్త, భారత దేశపు మొట్టమొదటి మహిళా ముస్లిం ఉపాధ్యాయురాలు షేక్ ఫాతిమా 194వ జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని సామాజిక విశ్లేషకుడు, హైకోర్టు న్యాయవాది ఉల్లం శేషగిరిరావు కార్యాలయంలో ఫాతిమా చిత్రపటానికి మాజీ కౌన్సిలర్ తోట ఝాన్సీ లక్ష్మీబాయ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శేషగిరిరావు మాట్లాడుతూ ఆధునిక భారత తొలి ముస్లిం ఉపాధ్యాయురాలు ఫాతిమా జయంతిని పురస్కరించుకుని తెలంగాణ రాష్ట్రంలోని విద్యాసంస్థల్లో ఆ చదువుల తల్లి స్మృత్యర్థం ఆమె జన్మదినోత్సవం జరుపుకోవాల్సిందిగా తెలంగాణరాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయటం శుభ పరిణామమన్నారు. చరిత్రకారుడు సయ్యద్ నసీర్ అహమ్మద్ కృషి వల్లే ఫాతిమా చరిత్ర వెలుగు చూసిందన్నారు. ఆమె జీవితం గురించి నసీర్ అహ్మద్ తొలి పుస్తకం రాశారని, ఈ పుస్తకాన్ని తెలుగు, ఆంగ్లం, ఉర్దూ, కన్నడ భాషల్లో ప్రచురించి ఎంపిక చేసిన గ్రంథాలయాలకు, వ్యక్తులకు ఆయన కానుకగా అందించారన్నారు. ఈ గ్రంథం విడుదల అయ్యాక గత సంవత్సరం గూగుల్ కూడా 'గూగుల్ డ్యూడుల్' విడుదల చేసిందన్నారు. గత సంవత్సరం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఫాతిమా జీవిత చరిత్రను పాఠశాలల విద్యార్థులకు పాఠ్యాంశం చేసిందని ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో మానవహక్కుల వేదిక నాయకుడు,న్యాయవాది బత్తిన శ్రీనివాసబాబు, న్యాయవాదులు గుజ్జర్లపూడి మార్కురావు, ఎం.వి.చలపతిరావు, నర్రా శ్రీనివాసరావు, దివ్వెల శ్రీనివాసరావు, మాచర్ల మహేశ్వరి, బీరువాల హుస్సేన్, ఉన్నారు

నేడు అచ్చంపేటలో ముక్కోటి ఏకాదశి తిరునాళ్ల

ఉత్తర ద్వార దర్శన ఏర్పాట్లు పూర్తి

అచ్చంపేట: ముక్కోటి వైకుంఠ ఏకాదశి సందర్భంగా స్థానిక సీతారామస్వామివారి దేవాలయం వద్ద వాసవీ కన్యకాపరమేశ్వరి వర్తక సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం తిరునాళ్ల మహోత్సవాలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. గత 128 సంవత్సరాలుగా అచ్చంపేటలో ముక్కోటి ఏకాదశి తిరునాళ్లు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. తెల్లవారుజామున సీతాసమేతుడైన శ్రీరామచంద్రునికి అర్చనలు, మూలమూర్తికి స్నపన ఉత్తరద్వార దర్శనం ద్వారా భక్తులకు సాక్షాత్కారంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి వర్తక సంఘం, శ్రీ లక్ష్మీ తిరుపతాంబ భజన సమాజం వార్లచే వేర్వేరుగా భజన కార్యక్రమాలు జరుగనున్నాయి. మహిళా విభాగం వారిచే తిరుప్పావై విష్ణు సహస్రనామార్చనలు జరుగుతాయి. మధ్యాహ్నం ఒంటి గంటకు సీతాసమేతుడైన శ్రీరామచంద్రులవారు దేవాలయాలనికి సమీపంలో ప్రత్యేకంగా నిర్మించిన కొతారులో ప్రవేశిస్తారు. దేవాలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు.

హరిహర క్షేత్రంలో...

స్థానిక హరిహర క్షేత్రంలోని వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో ముక్కోటి ఏకాదశి సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు జరుగనున్నాయి. వేకువ జామున 5 గంటల స్వామివారు ఉత్తర ద్వారం ద్వారా భక్తులకు దర్శనమిస్తారు. రాత్రి 7 గంటలకు పులుపుల ఫణిశర్మ, కోటమర్తి అనిల్‌కృష్ణశర్మచే శ్రీదేవీ భూదేవి సమేత వేంకటేశ్వరస్వామివారి కళ్యాణ మహోత్సవం జరుగనుంది.

'పది' విద్యార్థులకు స్టడీమెటీరియల్స్ పంపిణీ


స్టడీ మెటీరియల్స్‌తో విద్యార్థులు

అచ్చంపేట: వచ్చే మార్చిలో జరిగే 10వ తరగతి పబ్లిక్ పరీక్షలలో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకుగాను తులసి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ అధినేత టి.మురళీకృష్ణ సౌజన్యంతో పంపిన స్టడీ మెటీరియల్స్‌ని గురువారం అచ్చంపేటలో రాష్ట్ర ఉపాధ్యాయ యూనియన్ (ఎస్టీయు) మండలశాఖ వారు పంపిణీ చేశారు. మండలంలో అచ్చంపేట, కోనూరు, పెదపాలెం, మాదిపాడు, కొండూరు కస్తూర్బా బాలికల పాఠశాల, ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో టెన్త్ చదివే విద్యార్థులు నాలుగు వందలకు పైగా ఉన్నారు. పరీక్షలను దృష్టిలో ఉంచుకుని నిష్ణాతులైన ఉపాధ్యాయులచే తయారు చేయించిన స్టడీ మెటీరియల్స్ ఎస్టీయు ఉపాధ్యాయులు ప్రతి పాఠశాలకు స్వయంగా వెళ్లి విద్యార్థులకు పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు ఎం.కృష్ణానాయక్, ఎస్.రాఘవ, కె.గంగాధర్, గంగయ్య, కేశవరావు, కె.రవికుమార్, ఎం.మోహన్‌బాబు, హెచ్ఎం బిక్షాలునాయక్, అగస్టీన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అమరావతిలో...

అమరావతి: ఈ విద్యా సంవత్సరంలో పదవ తరగతి విద్యార్థులకు పాఠ్యాంశాలు సలభంగా అర్థమయ్యే విధంగా ఐక్య ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన పదవ తరగతి స్టడీ మెటీరియల్‌ను గురువారం మండల పరిధి లోని మునగోడు జడ్పీ హైస్కూల్‌లో గురువారం పంపిణీ చేశారు. ఎంఈఓ ప్రసాదరావు చేతుల మీదుగా విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. హెచ్ఎం కావూరు వెంకటేశ్వర రావు, ఎస్టీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు ఐజాక్, డి.మరియదాసు, నాయకులు సిహెచ్ అనిల్ కుమార్ జే సుబ్బారావులతో విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు

క్రోసూరులో...

క్రోసూరు: క్రోసూరులోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో గురువారం ఎస్టీయూ శాఖ పదవతరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ ఉచితంగా పంపిణీ చేసింది. ఈసందర్భంగా ఎస్టీయు ప్రతినిధులు మాట్లాడుతూ పాఠశాలలోని 40 మంది బాలికలకు మెటీరియల్ అందచేసినట్లు తెలిపారు. ఎంఈవో-2 గణేష్, పాఠశాల ప్రిన్సిపాల్ ఇందిరాప్రియదర్శిని, ఉపాధ్యాయులు, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్.రాఘవ, సంఘం సభ్యులు పాల్గొన్నారు

అర్చకుడిపై దాడి హేయం

సత్తెనపల్లి: పొన్నూరు నాగేంద్ర స్వామి దేవాలయంలో అర్చకునిగా విధులు నిర్వహిస్తున్న అర్చకుడు నూతలపాటి నాగేశ్వరశర్మ పై విజయ్ దినకర్ అనే వ్యక్తి దాడి చేయటం అత్యంత హేయమైన చర్య అని బ్రాహ్మణ ఐక్య వేదిక సత్తెనపల్లి డివిజన్‌అధ్యక్షుడు పెద్దింటి ఫణి కృష్ణ అన్నారు. పట్టణంలో గురువారం నిర్వహించిన బ్రాహ్మణ ఐక్య వేదిక సమావేశంలో ఆయన మాట్లాడారు. అర్చకుడు నాగేశ్వర శర్మ పై దాడి చాలా దారుణమైన వ్యవహారమన్నారు. ఈ దాడిని అర్చక సంక్షేమ సంఘం, బ్రాహ్మణ ఐక్యవేదిక తీవ్రంగా ఖండించారు. సత్తెనపల్లి డివిజన్ సెక్రటరీ కొడవటికంటి నాగ పార్వతయ్యశర్మ, కోశాధికారి అంపిరాయని రాజశేఖర్, ఐక్య వేదిక సభ్యులు ఉన్నారు.

కో-ఆప్షన్ సభ్యుడు అజ్గర్‌వలి మృతి

ముప్పాళ్ళ: మండల పరిషత్ కో-ఆప్షన్ సభ్యుడు షేక్ అజ్గర్‌వలి(54) గురువారం మృతి చెందాడు. మండల కేంద్రమైన ముప్పాళ్ళ కు చెందిన అజ్గర్‌వలి వైఎస్సార్ సీపీ తరుపున మండల పరిషత్ కో-ఆప్షన్ సభ్యుడిగా ఎన్నికయ్యాడు. మృతదేహాన్ని వైఎస్సార్ సీపీ నాయకులు రెండెద్దుల వెంకటేశ్వరరెడ్డి, ఎంజేఎం రామలింగారెడ్డి, మాజీ సొసైటీ అధ్యక్షుడు అన్నపరెడ్డి సాయిరెడ్డి, బ్రహ్మారెడ్డి, శ్రీనివాసరెడ్డిలు సందర్శించి నివాళులర్పించారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

భోజనం ప్లేట్లు అందజేత

నకరికల్లు: దాతల సహాయసహకారాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సమాచారహక్కుచట్టం ప్రచార ఐక్యవేదిక అధ్యక్షుడు ముజావర్ జాన్‌అహ్మద్ సూచించారు. మండలంలోని గుండ్లపల్లి గ్రామంలోని ఉర్దూ పాఠశాల విద్యార్థులకు భోజనం ప్లేట్లను పిడుగురాళ్ల ఆర్అండ్‌బీ ఏఈ షేక్.యూసూబ్ తరపున గురువారం అందజేశారు. హెచ్ఎం షేక్.జిలాని, పాఠశాల కమిటీ చైర్మన్ గార్లపాటి మాభు, ఉపాధ్యాయులు షేక్.రబ్బాని, షేక్. ఖాజా హుస్సేన్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'ప్రకృతి' ఉత్పత్తులకు డిమాండ్

రాజుపాలెం: ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన ఉత్పత్తులకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందని ప్రకృతి వ్యవసాయ జిల్లా డీపీఎం అమల కుమారి తెలిపారు. మండలంలోని గణపవరం గ్రామంలో ప్రకృతి వ్యవసాయం ద్వారా రైతు రమణయ్య పండించిన మిరపతోటను డీపీఎం, బెంగలూర్ హార్వెస్ట్ డిపో సీఈఓ మల్లిఖార్జునలు గురువారం పరిశీలించారు. డీపీఎం అమలకుమారి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటలకు అధిక ధరలతో అనేక రకాల కంపెనీల వారు కొనుగోలు చేసేందుకు ముందుకు వస్తున్నారని తెలిపారు.

సామాజిక తనిఖీలో అవినీతి బహిర్గతం

- బృందం తేల్చిన సొమ్ము రూ. 2.03 లక్షలు
- అధికారులు వసూలుకు ఆదేశించినది రూ.2.54 లక్షలు

సత్తెనపల్లి: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులపై సామాజిక తనిఖీ బృందం గురువారం ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో 17వ సామాజిక ప్రజా వేదిక నిర్వహించారు. సత్తెనపల్లి మండలంలోని వివిధ గ్రామాల్లో 2023-24 సంబంధించి 2023 ఏప్రిల్ ఒకటి నుంచి 2024 మార్చి 31 వరకు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, పంచాయతీరాజ్ కలిపి రూ. 15.06 కోట్లతో 1,397 పనులు చేపట్టారు. ఈ పనులకు సంబంధించి 2024 డిసెంబర్ 26న తనిఖీ బృందం మండలానికి చేరుకుంది. 26,27 తేదీల్లో మండలం నుంచి 25 గ్రామ పంచాయతీల రికార్డులను స్వీకరించింది. 28న ఎనిమిది బృందాలతో కూడిన తనిఖీ బృందం గ్రామాల్లో పర్యటించి పనులు తనిఖీ నిర్వహించి ఆయా గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించి గుర్తించిన అంశాలు చదివి వినిపించారు. గత నెల 28 నుంచి ఈ నెల 8 వరకు అన్ని గ్రామాల్లో క్షేత్రస్థాయిలో తనిఖీ చేసిన నివేదికలపై గురువారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో 17వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ప్రిసైడింగ్ అధికారి, డ్వామా పీడీ ఎం.సిద్ధాలింగమూర్తి హాజరు కాగా, ఎంపీడీఓ బండి శ్రీనివాసరెడ్డి అధ్యక్షత వహించారు. ఏపీడీ పొత్తూరి వెంకటనారాయణ, విజిలెన్స్ వింగ్ నుంచి విజయకుమారి, క్వాలిటీ కంట్రోల్ నుంచి జే.ప్రభాకర్, ఎస్ఆర్పీ లోకేష్ ఉన్నారు. గ్రామాల వారీగా తనిఖీ బృందం వారు తనిఖీ నిర్వహించిన 25 గ్రామ పంచాయతీల నివేదికలను ప్రిసైడింగ్ అధికారి ఎదుట చదివి వినిపించారు. వారు చేసిన అభియోగాలపై ప్రిసైడింగ్ అధికారి సిద్ధలింగమూర్తి రూ. 2.03 లక్షలు అవినీతి జరిగినట్లు నిర్ధారించి రికవరీకి ఆదేశాలు ఇచ్చారు. అపరాధ రుసుం రూపంలో మరో రూ. 51 వేలు సిబ్బంది (ఫీల్డ్ అసిస్టెంట్‌లు) పై రికవరీ విధించారు.

పాఠశాలల్లో సంక్రాంతి సంబరాలు


పాపాయపాలెం జెడ్పీ పాఠశాలలో..


స్ప్రిమ్స్ పాఠశాలలో సంక్రాంతి సంబరాలు


నకరికల్లు ఎంపీపీ మెయిన్‌లో చిన్నారుల వేషధారణలు

బెల్లంకొండ: మండలంలోని పాపాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ముందస్తు సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. సంబరాలలో భాగంగా పాఠశాల ప్రాంగణాన్ని తోరణాలతో సుందరంగా అలంకరించారు. విద్యార్థులకు సంక్రాంతి విశిష్టత తెలియజేసేందుకు ముగ్గుల పోటీలు, భోగి మంటలు, ఆటల పోటీలు ఏర్పాటు చేశారు. ఉపాధ్యాయులు, పెద్దలు విద్యార్థులకు భోగి పండ్లు పోశారు. హెచ్ఎం ఎం.శంకరరావు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

■ **స్ప్రిమ్స్ పాఠశాలలో..**

క్రోసూరు: క్రోసూరులోని స్ప్రిమ్స్ పాఠశాలలో గురువారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. స్కూల్ డైరెక్టర్ మక్కెన గోవర్ధన్ రావు పాల్గొని సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. డైరక్టర్ సతీమణి ఎం. పద్మావతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నకరికల్లు ఎంపీపీలో...

నకరికల్లు: అలనాటి ఆచార సాంప్రదాయాలను గుర్తుచేసే విధంగా విద్యార్థుల సంక్రాంతి సంబరాలు ఉన్నాయని ఎంఈఓ-2 ఎంఎల్ఎం ప్రసాద్ అన్నారు. స్థానిక ఎంపీపీ మెయిన్ పాఠశాలలో సంక్రాంతి సంబరాలను గురువారం ఘనంగా నిర్వహించారు. హరిదాసుల పాటలు, భోగిమంటలు, భోగిపండ్లవేడుక, గంగిరెద్దులు ఆటలు, రంగవల్లులు, గొబ్బెమ్మలతో వేడుకలు అంబరాన్నంటాయి. హెచ్ఎం మేదరమెట్ల స్వామి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

■ **నవోదయ పాఠశాలలో...**

రాజుపాలెం: మండలకేంద్రలోని నవోదయ ఇంగ్లిషు మీడియం పాఠశాలలో సంక్రాంతి సంబరాలను గురువారం నిర్వహించారు. ఈ సంబరాలలో విద్యార్థులు భోగి మంటలు వేసి సందడి చేశారు. విద్యార్థులు పోటాపోటీగా రంగవల్లులు తీర్చిదిద్దారు. హరిదాసు వేషధారణలో విద్యార్థులు అలరించారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ముగ్గుల పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు పాఠశాల ప్రిన్సిపాల్ ప్రత్తి రామారావు బహుమతులను అందించారు. డైరెక్టర్ ప్రత్తి హనుమంతరావు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

■ **అదనపు జిల్లా న్యాయస్థానం ఏర్పాటు చేయాలి**



సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో అదనపు జిల్లా న్యాయస్థానం ఏర్పాటు చేయాలని న్యాయవాదులు కోరారు. హైకోర్టు న్యాయమూర్తి, గుంటూరు జిల్లా పోర్టు పోలియో న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందనరావును సత్తెనపల్లి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం హైకోర్టులో న్యాయవాదులు కలసి వినతిపత్రం అందజేశారు. సత్తెనపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కంబాల అనిల్‌కుమార్, న్యాయవాదులు చిట్టా విజయభాస్కరరెడ్డి, దుగ్గినేని బాపయ్యచౌదరి, నరసింహ శాస్త్రీ, గుజ్జర్లపూడి మార్కురావు బగ్గి నరసింహరావు,కాకర్ల హరిబాబు, దివ్వెల శ్రీనివాసరావు, సయ్యద్ రహీం, ఎమ్.వీ.చలపతి, పూదోట రాజు, న్యాయవాదులు ఉన్నారు.

■ **వసతి గృహాల్లో సమస్యలను పరిష్కరించాలి..**

సత్తెనపల్లి: ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్, వైఎస్సార్ సీపీ నాయకుడు చిట్టా విజయభాస్కరరెడ్డి డిమాండ్ చేశారు. పట్టణంలోని వెంకటపతి నగర్ లో గల ఎస్సీ బాలికల కళాశాల వసతి గృహంలో చలికి ఇబ్బంది పడుతున్న 200 మంది విద్యార్థినిలకు చిట్టా చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో గురువారం దుప్పట్లు పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు అచ్యుత శివప్రసాద్, తుమ్మల వెంకటేశ్వరరావు, లోకా మాధవ, బండి మల్లికార్జునరెడ్డి, వల్లెం నరసింహారావు, యాసారపు.బాబు, మందడపు సాయి ఉన్నారు.

■ **క్రీడలతో మానసికోల్లాసం**



సత్తెనపల్లి: క్రీడలతో మానసికోల్లాసం చేకూరుతుందని సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీ నారాయణ అన్నారు. పట్టణంలోని శరభయ్య గుప్తా హిందూ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో సత్తెనపల్లి క్రికెట్ లీగ్ పోటీలను గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. టీడీపీ నాయకులు దరువూరి నాగేశ్వ రరావు, యెల్లినేడి రామస్వామి తదితరులు ఉన్నారు.

■ **మెరుగైన వైద్య సేవలు అందించాలి...**

సత్తెనపల్లి: ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు వచ్చే పేద రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సత్తెనపల్లి శాసనసభ్యుడు కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. ప్రభుత్వ ఏరియా వైద్యశాల తొలి అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. వైద్యశాల సూపరిండెంట్ డాక్టర్ బి.లక్ష్మణరావు, మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి, వైద్యశాల అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

■ **పురుగు మందు తాగి యువకుడు మృతి..**

పెదకూరపాడు: పురుగుల మందు తాగి యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలోని జలాలపురం గ్రామంలో చోటుచేసుకుంది. మండలంలోని జలాల్‌పురం గ్రామానికి చెందిన పాటిబండ్ల కిషోర్ రాజ్(25)కు గత నాలుగు నెలల క్రితం స్రవంతి అనే యువతితో వివాహమైంది. పాటిబండ్ల కిషోర్ రాజ్ ప్రైవేట్ జాబ్ చేస్తూ ఉన్నాడు. తన తల్లిని రూ. లక్ష ఇస్తే హైదరాబాదులో ఉంటానని అడగ్గా ఆమె అందుకు అంగీకరించకపోవడంతో మనస్థాపన చెంది ఈనెల 7న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. బంధువులు చికిత్స నిమిత్తం సత్తెనపల్లి ప్రైవేటు వైద్యశాల తరలించారు. చికిత్స పొందుతూ కిషోర్ రాజు గురువారం తెల్లవారుజామున మృతిచెందినట్లు ఎస్సై గిరిబాబు తెలిపారు.

■ **గర్భిణులకు పౌష్టికాహారం అందజేత...**

పెదకూరపాడు: మండలంలోని పెదకూరపాడు సామాజిక ఆరోగ్య కేంద్రం, 75త్యాళ్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య పరీక్షలకు వచ్చిన గర్భిణులకు మాగులూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం పౌష్టికాహారాన్ని ఎన్నారై మాగులూరి భాను ప్రకాష్ అందించారు. వైద్యులు, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

బెల్లంకొండ: గర్భిణుల్లో రక్తహీనత నివారించడమే ప్రధాన మంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ కార్యక్రమ లక్ష్యమని చంద్రాజుపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డా.అంశుధర్ తెలిపారు. గురువారం స్థానిక ఆరోగ్య కేంద్రంలో మండలంలోని అన్ని గ్రామాల్లో గల గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. సీహెచ్ఓ మణికుమారి, హెల్త్ విజిటర్ బేగం, సూపర్వైజర్ బాషా పాల్గొన్నారు.

■ **టీటీడీని వీహెచ్‌పీకి అప్పగించాలి..**

అమరావతి: తిరుపతిలో తొక్కిసలాట జరిగి ఆరుగురు ప్రాణాలు కోల్పోవటం, ఎంతో మంది గాయపడటం అమానుషమని తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు రాజీనామా చేసి విశ్వహిందూ పరిషత్‌కు అప్పగించాలని పల్నాడు జిల్లా బీజేపీ కార్యదర్శి కోలా వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఎంతో సాంకేతిక పరిజ్ఞానం పెరిగిన ప్రస్తుత రోజుల్లో తిరుపతిలో తొక్కిసలాట భక్తులు ఒక్కసారిగా పెరినందువల్లే జరిగిందనటం దారుణమన్నారు. ఏడుకొండలు విశాలమైన స్థలం అయినప్పటికీ నిర్వాహణ వైఫల్యంతో ఘటన జరిగిందన్నారు. ఇప్పటికైనా టీటీడీ బోర్డు ఆలయాన్ని విశ్వహిందూ పరిషత్‌కు అప్పగించకుంటే హిందూ సమాజం నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు.

బాల్య వివాహాల సమాచారం ఇవ్వండి

ఐసీడీఎస్ ఎల్‌పీఓ జె.ప్రశాంతి

బయ్యవరం(క్రోసూరు): బాల్యవివాహాలు జరుగుతున్నట్లు తెలిస్తే చైల్డ్ హెల్ప్‌లైన్‌కు సమాచారం ఇవ్వాలని ఐసీడీఎస్ ఎల్‌పీఓ జె.ప్రశాంతి కోరారు. గురువారం మండలంలోని బయ్యవరం గ్రామంలోని జెడ్పీపాఠశాలలో కిషోర బాలబాలికలకు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పలు అంశాలపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఎల్‌పీఓ మాట్లాడుతూ బాల్యవివాహాలు చట్టవిరుద్ధమని అన్నారు. బాల్యవివాహాలు జరగకుండా సమాజంలో ప్రతి ఒక్కరు బాధ్యత తీసుకోవాలన్నారు. ఎక్కడైనా జరుగుతున్నట్లు తెలిసినా దానిని ఎదుర్కొనేందుకు, అరికట్టేందుకు చైల్డ్‌హెల్ప్‌లైన్‌కు 1098కు ఫోన్ చేయవచ్చునన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మాధవీలత వ్యక్తిగత పరిశుభ్రత గురించి వివరించారు. బాలికలకు గుడ్‌టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, కిషోర బాలబాలికలు తదితరులు పాల్గొన్నారు.